
క్లుప్తంగా

ఘనంగా పార్వతమ్మ పేరంటాలు తిరునాళ్లు

పద్మనాభం : మండలంలోని పెంట గ్రామంలో పార్వతమ్మ పేరంటాలు తిరునాళ్లు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలోని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పెంటతోపాటు పాత కొవ్వాడ, కొత్త కొవ్వాడ, అనంతవరం గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తిరునాళ్ల ఉత్సవంలో పాల్గొన్నారు.

24 నుంచి సాయి మందిర వార్షికోత్సవాలు



సాయి మందిరం

కొమ్మాది: స్థానిక కొమ్మాది పద్మావతి కాలనీలో గల మూడు అంతస్తుల శిరిడీ సాయి మందిర వార్షికోత్సవం ఈ నెల 24 నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు సామూహిక సాయి సత్య వ్రతాలు, మూడు కోట్ల శ్రీ సాయి నామాలతో గల సాయి కోటి పుస్తకాలతో ఊరేగింపు, రెండో రోజు సాయిబాబాకి పుష్పాభిషేకం, అమ్ముల సాంబశివరావు సత్సంగం నిర్వహించనున్నామని తెలిపారు.

సంస్థల మధ్య ఆరోగ్యకర పోటీకి ప్రత్యేక చట్టం



సీసీఐ డైరెక్టర్ సుఖేష్ మిశ్రాకు జ్ఞాపిక అందజేస్తున్న గీతం ప్రతినిధులు

కొమ్మాది: వాణిజ్య రంగంలో ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వ కాంపిటీషన్ చట్టం – 2002 ఉపయోగపడుతుందని కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా న్యాయ విభాగం డైరెక్టర్ సుఖేష్ మిశ్రా పేర్కొన్నారు. గీతంలో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీ వాతావరణంలో సంస్థలు ఒకరిపై ఒకరు ఆధిపత్యం సాధించడానికి అనైతిక మార్గాలు అనుసరించకుండా కాంపిటీషన్ చట్టం నిరోధిస్తుందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన పోటీతత్వం వల్ల వినియోగదారులకు కూడా ప్రయోజనం కలుగుతుందన్నారు.

యువకుడి ఆత్మహత్య

కొమ్మాది: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సుభాష్‌నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి సుభాష్‌నగర్‌కు చెందిన నేతాడ కృష్ణ (28) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రెండు వారాలుగా పనికి వెళ్లకుండా ఇంట్లోనే ముభావంగా ఉంటున్నట్లు ఆయన తండ్రి నేతాడ శ్రీను తెలిపారు. ఏమైందని ఎన్ని సార్లు ప్రశ్నించినా మౌనంగా ఉన్నాడని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కృష్ణ తల్లిదండ్రులు పనుల నిమిత్తం గాజువాక వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం సాయంత్రం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. క్రికెట్ బెట్టింగ్‌ల వల్లే కృష్ణ ఆత్మహత్య చేసుకుని వుంటాడని స్నేహితులు అంటున్నారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

దుకాణం దగ్ధం

తగరపువలస : మహరాజుపేట కూడలిలో కర్రోతు లక్ష్మికి చెందిన పకోడీ దుకాణంలో గురువారం సాయంత్రం గ్యాస్ సిలిండర్ లీకవడంతో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దుకాణం దగ్ధం కావడంతోపాటు మూడు సిలిండర్లు పేలిపోయాయి. నష్టం రూ.లక్ష వరకు ఉంటుందని అంచనా. తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు.

సంక్షేమ పథకాలే గెలుపునకు సోపానాలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



లక్ష్మీపురం గ్రామ సచివాలయం నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



లక్ష్మీపురంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస : రాష్ట్రంలో పులివెందుల తర్వాత సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్యే తదితర పదవులన్నీ నూరుశాతం వైఎస్సార్ సీపీ గెలుచుకోవడం భీమిలిలోనే సాధ్యమైందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో వలంటీర్లకు వందనం, రూ.25 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనం ప్రారంభోత్సవం, 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాల్లో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు సోపానాలు అవుతాయన్నారు. నాయకుల మధ్య చిన్నపాటి పొరపచ్చాలు పక్కన పెడితే 'వై నాట్ 175'లో భీమిలి కూడా భాగమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీపై పోటీ చేసిన జనసేన, టీడీపీ నాయకులకు కూడా సంక్షేమ పథకాలు అందించిన గొప్ప మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రతి పంచాయతీలో వైఎస్సార్‌సీపీకి ఎక్కువ మెజారిటీ వచ్చేలా అందరూ కలిసి ఇప్పటి నుంచే గట్టిగా పని చేయాలని కోరారు. విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి కూడా సమర్థవంతమైన, విద్యాధికురాలైన నాయకురాలన్నారు. తమ ఇద్దరి భాగస్వామ్యంతో భీమిలిని మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 16 పంచాయతీలు, జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డుకు చెందిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవా మిత్ర అవార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష మాట్లాడుతూ సామాజిక న్యాయం అమలుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేస్తున్న కృషిని అభినందించి తన పాటలతో హుషారెత్తించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీడీవో జానకి, భీమిలి ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్ లచ్చుబుగత జగదీశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, యూత్ అధ్యక్షుడు చిల్ల హరి, కొయ్య అప్పల సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు జీవీ నారాయణ, కాద సూర్యనారాయణ, మజ్జి సూరినాయుడు, కొయ్య రామకృష్ణారెడ్డి, చెల్లూరి నగేష్, కొల్లి కోటిరెడ్డి, మజ్జి శ్రీనివాసరావు, మద్దిల వెంకటరమణ, కుంటుబోతు వెంకన్న, శిరిగుడి ఈశ్వరరావు, పల్లా సన్యాసిరావు, బోనిల సన్నిబాబు, గాడు తాతినాయుడు, కరుభుక్త వెంకటరమణ, గుడ్డాల ఎల్లయ్య, తుపాకుల అప్పలరాజు, మేరుగు ఎల్లాజీ, బొడ్డు దుర్గారావు, ముద్దాడ అప్పలనాయుడు, దుంపల ప్రభాకర్, చిల్ల వెంకటరమణ, భాగం సుధాకర్, ఆవాల గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

గ్రావెల్ కోసం తీసిన గొయ్యి చెత్తతో పూడ్చివేత

విచారణకు పలువురి డిమాండ్



నమ్మివానిపేట డంపింగ్‌యార్డులో గ్రావెల్ కోసం తీసిన గొయ్యిని చెత్తతో పూడ్చిన దృశ్యం

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేట డంపింగ్‌యార్డులో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మాణానికి వినియోగించేందుకు గ్రావెల్ కోసం తవ్విన గోతిని నిర్వాహకులు హడావిడిగా చెత్తతో పూడ్చేశారు. సుమారు రూ.40 లక్షలతో స్టేషన్ నిర్మాణానికి బయటి నుంచి నాణ్యమైన గ్రావెల్ తీసుకు రావాల్సి వుండగా... నిర్మాణదారులు డంపింగ్‌యార్డులోనే నిర్మాణాన్ని ఆనుకుని చెత్తతో కూడిన గ్రావెల్‌ను వినియోగించారు. సుమారు 400 లారీలకు పైగా గ్రావెల్ బయటి నుంచి తీసుకురావడానికి వీరికి రూ.4 లక్షల వరకు ఖర్చుతుందని అంచనా. ఈ మొత్తాన్ని మిగుల్చుకునేందుకు ఏళ్ల తరబడి చెత్తతో మురిగిపోయిన ప్రదేశంలోని గ్రావెల్ తీసి వినియోగించారు. దీనిపై 'గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మాణంలో కక్కుర్తి' శీర్షికతో ఈ నెల 21న సాక్షిలో కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీంతో హడావిడిగా నిర్వాహకులు గత రెండు రోజుల నుంచి డంపింగ్‌యార్డు చెత్తతోనే ఆ గోతిని పూడ్చేయడం గమనార్హం. స్టేషన్ నిర్మాణంలో నాసిరకం గ్రావెల్ వినియోగించడం ఒక తప్పయితే, గ్రావెల్ కోసం తీసిన గోతిని క్లాప్ వాహనాల ద్వారా సేకరించిన చెత్తతో కప్పివేయడం మరొక తప్పని స్థానికులు అంటున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎట్టకేలకు మళ్లీ కూల్చారు

సాక్షి ఎఫెక్ట్..



సంగివలసలో తొలగించిన షట్టర్లు, దుకాణాలు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు సంగివలస – పాండ్రంగి రహదారిని ఆక్రమించి చేపట్టిన రెండు దుకాణాలను ఎట్టకేలకు టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. గతంలో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలని నిర్ధారించి కూల్చిన చోటే ఆక్రమణదారులు మళ్లీ కట్టడాలు చేపట్టడంతో... 'కూల్చిన చోటే.. మళ్లీ నిర్మాణాలు' శీర్షికతో ఈ నెల 20న సాక్షిలో వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై రెండు రోజులపాటు తటపటాయించిన టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై ఒత్తిడి పెరగడంతో ఆ అక్రమ నిర్మాణాలు తొలగించక తప్పలేదు. మరో వైపు భీమిలి బీఎస్ఎన్ఎల్ కార్యాలయాన్ని ఆనుకుని గత నవంబరులో కూల్చిన చోట మళ్లీ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందన లేకుండా వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. భీమిలి జోన్‌లో పలుచోట్ల ఆక్రమణలపై సమాచారహక్కు చట్టం ప్రకారం వివరణ కోరనున్నట్టు ప్రజా సంఘాల ప్రతినిధులు తెలిపారు.

రూ.కోటితో ఆదర్శనగర్‌లో అభివృద్ధి



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రెండో వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరుణాకరరెడ్డి

తగరపువలస : జీవీఎంసీ 2వ వార్డు ఆదర్శనగర్‌లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.కోటితో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్టు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి అన్నారు. ఆదర్శనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో 90 శాతం పనులు పూర్తి చేశామన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.2వేల కోట్లతో అభివృద్ధి పనులు నియోజకవర్గంలో పూర్తి చేశారన్నారు. ప్రతిపక్షాల నాయకులు కళ్లు తెరిచి అభివృద్ధి పనులు చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, సీనియర్ నాయకులు చిల్ల బాబయ్యరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, వంశీరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల నరసింగ రెడ్డి, గుజ్జు రాము, నమ్మి భాస్కరరావు, చిల్ల ప్రమీల, కృష్ణవేణి, జీరు పద్మ, దుర్రి రామయ్యమ్మ, చేట్ల అప్పలసూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్యానంద త్రయోదశి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు



శ్రీ చైతన్య నిత్యానంద స్వామికి పంచామృతాభిషేకం చేస్తున్న పండితులు

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో గురువారం నిత్యానంద త్రయోదశి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా నితాయి గౌరంగకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక హారతి, భక్తి గీతాలతోపాటు శయన హారతి నిర్వహించారు. వివిధ పుష్పాలతో రాధాకృష్ణులు, జగన్నాథ, సుభద్ర, బలభద్రులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

భక్తితో శ్రీ చైతన్య నిత్యానంద స్వామి జయంతి

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న హరేకృష్ణ వైకుంఠ క్షేత్రం ప్రదేశంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం శ్రీ చైతన్య నిత్యానంద స్వామి దివ్య ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య నిత్యానంద స్వామికి సప్త నదుల నుంచి సేకరించిన పవిత్ర జలాలతో నింపిన 108 కలశాలతో అభిషేకం చేశారు. వందలాది మంది భక్తులు హరినామ సంకీర్తనతో ఉత్సవ ప్రాంగణం హోరెత్తింది. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస ప్రవచిస్తూ ఆధ్యాత్మిక అవగాహన లేకపోవడం వల్ల మానవులు ప్రశాంతత కోల్పోయి మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారని చెప్పారు. అందరూ దైవారాధనను వ్యాప్తి చేయాలన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

మధురవాడ : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని శ్రీ శిరిడీ సాయి జ్ఞాన మందిరం వార్షికోత్సవాలు మూడు రోజుల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం స్వామికి పంచామృత, సుగంధ అభిషేకాలు చేశారు. అనంతరం అన్నాభిషేకం చేసి స్వామిని విశేషంగా అలంకరించారు. సుమారు 2 వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆఖరి రోజు వేడుకలకు ఎమ్మెల్యే శ్రీనివాసరావు హాజరయ్యారు. ఆయనకు అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం బాబా వారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. కోలాటం కళాకారులను, నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ ముళ్లపూడి వెంకట దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు వాండ్రాసి రవికుమార్, లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



గొట్టిపల్లిలో అధికారులు తొలగించిన అక్రమ నిర్మాణం

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురంలో అక్రమ నిర్మాణాన్ని అధికారులు గురువారం తొలగించారు. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... గొట్టిపల్లి సర్వే నంబరు 185లో కొండ పోరంబోకు స్థలం ఉంది. అందులో ప్రభుత్వం కాలనీ ఇళ్లను మంజూరు చేసింది. కాగా అక్కడ ఓ వ్యక్తి నిబంధనలు అతిక్రమించి రోడ్డు స్థలాన్ని కూడా కలుపుకొని ఇంటిని నిర్మిస్తున్నాడు. దీంతో కొంత మంది గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన అధికారులు అక్రమ నిర్మాణం తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'సురక్ష'తో ఇంటి వద్దకే ఆరోగ్య సేవలు



చంద్రంపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సిబ్బంది, నాయకులు

మధురవాడ : ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందుతున్నాయని, వీటిని అంతా సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి దీపిక, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పోతిన పైడిరాజు, పిళ్లా వెంకటరమణ, పిళ్లా చంద్రశేఖర్ తదితరులు కోరారు. జీవీఎంసీ 7వ వార్డు 59వ నంబరు సచివాలయం పరిధి చంద్రంపాలెం రచ్చబండ వద్ద మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు అవసరమైతే ఆరోగ్య శ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందించేందుకు కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని కొనియాడారు. మెడికల్ ఆఫీసర్లు ఎం.కీర్తి సందీప్, వైద్యులు సయ్యద్ అజమాల్, దిలీప్ కృష్ణ, సింధూరి, రత్నం, పి.సత్యవతి తదితరులు 530 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ సత్యవతి, జి.జ్యోతిపుష్ప, వెంకటరావు, ఉమా మహేశ్వరి, నాయకులు పిళ్లా లక్ష్మణ, పిళ్లా అప్పన్న, పిళ్లా పోతరాజు, పిళ్లా రామారావు, యస్.శ్రీను గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

నాటు కోళ్ల పెంపకంతో అధిక ఆదాయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సజ్జల శ్రీనివాస్

పీఎం పాలెం : నాటు కోళ్ల పెంపకంతో అధిక ఆదాయం పొందవచ్చని పశువైద్య శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సజ్జల శ్రీనివాస్ అన్నారు. జీవీఎంసీ ఆరో వార్డులోని శంభువానిపాలెం గిరిజన గ్రామంలో రోటరీ క్లబ్ వారు గురువారం నిర్వహించిన మహిళా సాధికారత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటు కోళ్ల పెంపకం లాభదాయకంగా వుంటుందన్నారు. కోళ్లకు సాధారణంగా వచ్చే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేసేందుకు పశువైద్య శాఖ సిబ్బంది అందుబాటులో వుంటారన్నారు. ముందుగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు రోటరీ క్లబ్ వారు నాటు కోడి పిల్లలను అందజేస్తారని క్లబ్ ప్రెసిడెంట్ కె.కిరణ్ కుమార్ తెలిపారు. ఉత్పత్తి చేసిన కోడిగుడ్ల కొనుగోలు బాధ్యత కూడా తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ రవికిరణ్, డైరెక్టర్ వరప్రసాద్, మధురవాడ పశువైద్యాధికారి అనుపమ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై క్వారీ లారీ బోల్తా



తాళ్లవలస వద్ద బోల్తా పడిన క్వారీ లారీ

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై బుధవారం రాత్రి క్వారీ లారీ బోల్తా పడింది. ఆనందపురం మండలం కుసులవాడ నుంచి రాయి లోడుతో తగరపువలస వైపు వస్తున్న లారీ వలందపేట సమీపంలో బోల్తా పడింది. ప్రమాద సమయంలో లారీలో డ్రైవర్ మాత్రమే ఉన్నాడు. అతను సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో భీమిలి ట్రాఫిక్, రోడ్ సేఫ్టీ పోలీసులు క్రమబద్ధీకరించారు.

సేవా పురస్కారాల ప్రదానం నేడు

పద్మనాభం : మండలంలోని కొత్త కొవ్వాడలో వలంటీర్లకు సేవా పురస్కారాలు శుక్రవారం అందజేయనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ పురస్కారాలను వలంటీర్లకు అందజేయనున్నారని చెప్పారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

గ్రావెల్ తవ్వకాలు అరికట్టాలని ఫిర్యాదు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ సర్వే నంబరు 27లోని కొండపై నుంచి కొందరు అక్రమార్కులు గ్రావెల్‌ని ఇష్టానుసారంగా తరలించుకు పోతున్నారని, అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొండపై అభివృద్ధి చేస్తున్న లే అవుట్‌ను ఆనుకుని ఉన్న రోడ్డులో అక్రమార్కులు గ్రావెల్ తవ్వేస్తున్నారన్నారు. నగరానికి అత్యంత దగ్గరగా ఉన్న మధురవాడ ప్రాంతం నుంచి ప్రకృతి సంపద తరలిపోతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాల నివారణ

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది గురువారం మండలంలోని దాకమర్రి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యుత్, గ్యాస్ సిలిండర్ల ప్రమాద సమయంలో అప్రమత్తతపై సూచనలు చేశారు. అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, పంచాయతీ కార్యదర్శి డి.రఘునాథ బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రచారం



మాట్లాడుతున్న కులిడి సురేష్‌బాబు

భీమునిపట్నం : ఉమ్మడి విశాఖ జిల్లాలో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రచారం చేయనున్నామని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కులిడి సురేష్‌బాబు అన్నారు. ట్రస్టు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలా దేశంలో సంక్షేమ పాలన ఎవరూ అందించలేదన్నారు. విద్య, వైద్య రంగాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాయన్నారు. గత పాలకులు హామీలు ఇచ్చి, ప్రచారం చేసుకున్నారు తప్ప అమలు చేయలేదన్నారు. అన్ని వర్గాలకూ మేలు జరగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ గెలుపు కోసం త్వరలో ప్రచారం ప్రారంభిస్తామని, ప్రతిపక్షాల కుట్రలు ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా సీఎం జగన్ దరిదాపుల్లోకి కూడా రాలేవన్నారు. ఆయనతోపాటు నర్సింహ, విజయ్ తదితరులు ఉన్నారు.

కృత్రిమ మేధతో మార్పులు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగానికి అనుబంధంగా గల అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మిషనరీ (ఏసీఎం) విద్యార్థి విభాగం ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. డేటా సైన్స్ నిపుణులు డాక్టర్ బి.సంతోష్ కుమార్ ప్రసంగిస్తూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో కృత్రిమ మేధ, డేటా సైన్స్, డేటా మైనింగ్ సమూల మార్పులు తీసుకొస్తున్నాయని తెలిపారు. కృత్రిమ మేధ వంటివి వైద్య, ఆరోగ్య రంగంలో విరివిగా ఉపయోగిస్తున్నారని తెలిపారు.

ఇకపై అంతరాయం లేకుండా ఆధార్ సేవలు

సాక్షి ఎఫెక్ట్..



ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

తగరపువలస : భీమిలి జోన్ సంతపేట వార్డు సచివాలయంలో ఇకపై అంతరాయం లేకుండా ఆధార్ సేవలు అందిస్తామని సచివాలయ సిబ్బంది తెలిపారు. 'ఆధార్ సెంటర్లు సమయపాలన పాటించాలి' శీర్షికతో సాక్షిలో గురువారం ప్రచురించిన వార్తకు సచివాలయ సిబ్బంది స్పందించారు. ఈ నెల 20న సర్వర్ నెమ్మదించడం, 'నాడు – నేడు' పాఠశాలల సందర్శన కారణంగా స్వల్పంగా జరిగిన అంతరాయానికి ఎవరో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసినట్టు సిబ్బంది తెలిపారు. మెరుగైన సేవలు అందిస్తున్నందున ఆగస్టు 15, రిపబ్లిక్ డే వేడుకల్లో తమ సచివాలయానికి కలెక్టర్ నుంచి పురస్కారాలు వచ్చాయన్నారు. ఇకపై పూర్తి స్థాయిలో ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు.